మెట్రో ఫేజ్-2 విస్తరణ ప్రతిపాదనలను ఆమోదించాలి

(3వ పేజీ తరువాయి)

నిర్మాణం పూర్తయితే హైదరాబాద్ చుట్టూ రవాణా వ్యవస్థ మరింత బలోపేతమవుతుందన్నారు. దక్షిణ భాగానికి సంబంధించిన అలైన్‌మెంట్ మ్యాపులు, హెచ్ఎండీఏ మాస్టర్ ప్లాన్ నోటిఫికేషన్లను ఇప్పటికే కేంద్ర రోడ్డు రవాణా శాఖకు అందించామని చెప్పారు. ఉత్తర, దక్షిణ కారిడార్లను ఒకేసారి ఆమోదించి అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు.హైదరాబాద్అమరావతిమచిలీపట్నం పోర్ట్ ఎక్స్‌ప్రెస్‌వేకు కేంద్రం అనుమతి ఇవ్వాలని ముఖ్యమంత్రి కోరారు. హైదరాబాద్ నుంచి అమరావతి మీదుగా బందర్ పోర్టును కలిపే 12 లేన్ ఎక్స్‌ప్రెస్‌వే తెలంగాణకు వ్యూహాత్మకంగా ఉపయోగపడుతుందని చెప్పారు. 120 మీటర్ల రైట్ ఆఫ్ వేతో ప్రతిపాదించిన ఈ హైవే ద్వారా సముద్ర తీరం లేని తెలంగాణకు పోర్ట్ కనెక్టివిటీ లభిస్తుందని వివరించారు. ఫార్మా, ఎలక్ట్రానిక్స్, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాల ఎగుమతులకు ఇది కీలక మార్గంగా నిలుస్తుందన్నారు.వరంగల్ ఎయిర్‌పోర్ట్ పనుల అంశాన్ని కూడా సీఎం రేవంత్ ప్రస్తావించారు. ఇప్పటికే అవసరమైన భూసేకరణ పూర్తిచేసి ఎయిర్‌పోర్ట్ అథారిటీకి అప్పగించామని తెలిపారు. ఈ ఎయిర్‌పోర్ట్ అందుబాటులోకి వస్తే ఉత్తర తెలంగాణ పారిశ్రామిక, విద్య, పర్యాటక రంగాలకు మరింత లబ్ధి చేకూరుతుందన్నారు. హైదరాబాద్‌లో ఐఐఎం ఏర్పాటు చేయాలని ప్రధాని మోడీని సీఎం కోరారు. ఐఐఎంకు అవసరమయ్యే 200 ఎకరాల స్థలం కేటాయించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. తెలంగాణలో ఇప్పటికే ఐఐటీ, ఐఐఐటీ, నల్సార్, టీఐఎఫ్ఆర్ వంటి ప్రముఖ జాతీయ విద్యాసంస్థలున్నాయని.. ఐఐఎం ఏర్పాటు చేస్తే నూతన విద్యావిధానం2020 ఆశించిన లక్ష్యం కూడా నెరవేరుతుందన్నారు. అనంతరం కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌తోనూ రేవంత్‌రెడ్డి భేటీ అయ్యారు. హైదరాబాద్ మెట్రో ఫేజ్ 2, మూసీ ప్రక్షాళన, పట్టణ అభివృద్ధి శాఖకు సంబంధించిన అంశాలపై చర్చించారు.

తక్షణ మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వలేం

(3వ పేజీ తరువాయి)

తెలియగానే కాంగ్రెస్ నేతలంతా కలిసి ఆందోళకు దిగారు. ఎన్నికల కమిషన్ సాయంతో బీజేపీ ఇలాంటి కుట్రలకు పాల్పుతోందని వారంతా ఆరోపిస్తున్నారు. రిటర్నింగ్ అధికారులు ప్రభావితం అయ్యారని, ప్రభుత్వ ఆదేశాల మేరకు వ్యవహరిస్తున్నారంటూ ఆరోపిస్తున్నారు. ఈ క్రమంలో నామినేషన్ తిరస్కరిస్తూ రిటర్నింగ్ అధికారి తీసుకున్న నిర్ణయాన్ని ఏఐసీసీ సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. ఈ పిటిషన్ ను విచారణకు అంగీకరించిన సుప్రీంకోర్టు శుక్రవారం విచారిస్తామని తెలిపింది. మరి శుక్రవారం సర్వోన్నత న్యాయస్థానం ఎలాంటి నిర్ణయం తీసుకోబోతోంది అనేది సర్వత్రా ఉత్కంఠగా మారింది.

ఇరాన్‌పై అత్యంత భీకర స్థాయిలో దాడులు

విశ్వంభర, నేషనల్ బ్యూరో : పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తారస్థాయికి చేరుకున్న వేళ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సంచలన ప్రకటన చేశారు. ఇరాన్‌పై ఈ రాత్రి అత్యంత భీకర స్థాయిలో దాడులు చేస్తామని హెచ్చరించారు. ఇరాన్ నౌకాదళం, వైమానిక దళం, రాడార్ వ్యవస్థలు ఇప్పటికే లేకుండా పోయాయని చెప్పారు. సమీప భవిష్యత్తులో ఇరాన్‌కు చెందిన వ్యూహాత్మక ఖర్గ్ ద్వీపంతో పాటు చమురు కేంద్రాలను స్వాధీనం చేసుకుంటామని హెచ్చరించారు. ఇరాన్ చమురు, గ్యాస్ మార్కెట్లపై పూర్తి నియంత్రణ సాధిస్తామని చెప్పారు. వెనెజువెలా చమురు మార్కెట్‌ను ఏ విధంగానైతే నియంత్రణలోకి తెచ్చుకున్నామో, ఇరాన్ విషయంలోనూ అదే చేయబోతున్నట్లు ట్రంప్ ప్రకటించారు. ప్రస్తుతం ఈ విధానం అటు వెనెజువెలా, ఇటు అమెరికాకు అద్భుతంగా పనిచేస్తోందని ట్రంప్ వ్యాఖ్యానించారు. అయితే, వాషింగ్టన్‌తో ఒప్పందాన్ని ముగించడంలో టెహ్రాన్ చేస్తున్న జాప్యంపై ట్రంప్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇరాన్‌పై దాడులను కఠినతరం చేస్తామని ట్రంప్ బుధవారం తెలిపారు. అమెరికాకు చెందిన అపాచీ హెలికాప్టర్‌ను ఇరాన్ కూల్చివేయడమే ఈ తాజా సైనిక చర్యకు కారణమని ఆయన పేర్కొన్నారు. ఇరాన్‌కు గట్టి సందేశం ఇచ్చేందుకే ఈ చర్యలు చేపట్టినట్లు మీడియాతో అన్నారు. "నిన్న మేము వారిని గట్టి దెబ్బకొట్టాం. ఒకవేళ మీరు గమనించకపోయినా, మీ టెలివిజన్ ఆన్ చేయకపోయినా, ఈరోజు కూడా వారిని మళ్లీ గట్టిగా దెబ్బకొట్టబోతున్నాం. ఆ తర్వాత ఈ ఒప్పందంతో ఏం జరుగుతుందో చూద్దాం" అని ట్రంప్ తెలిపారు.

సెటెబె వాణిజ్య నౌకపై అమెరికా దాడి

విశ్వంభర, నేషనల్ బ్యూరో : ఒమన్ తీరంలో భారతీయ సిబ్బందితో ప్రయాణిస్తున్న సెటెబె వాణిజ్య నౌకపై అమెరికా బుధవారం జరిపిన దాడి కలకలం సృష్టించింది. దాడి సమయంలో నౌకలో 24 మంది భారతీయ సిబ్బంది ఉండగా.. వారిలో ముగ్గురు నావికులు ప్రాణాలు కోల్పోయారు. ఈ విషయాన్ని షిప్పింగ్ మినిస్టర్ సర్బానంద సోనోవాల్ ధ్రువీకరించారు. ఇది విషాదకరమైన ఘటన అని, ఆ ముగ్గురి మృతదేహాలను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. మృతులను డెక్ క్యాడెట్ ఆదిత్య శర్మ, ఇంజిన్ ఫిట్టర్ శివానంద్ చౌరాసియా, చీఫ్ ఇంజినీర్ పట్నాల సురేశ్‌గా గుర్తించారు. తమ దిగ్బంధనాన్ని ఉల్లంఘిస్తూ ఇరాన్ నుంచి చమురు రవాణా చేసేందుకు ప్రయత్నించినందుకే ట్యాంకర్‌పై కాల్పులు జరిపామని అమెరికా సైన్యం తెలిపింది. ఈ దాడిని భారత్ తీవ్రంగా ఖండించింది. అమెరికా చర్యపై ఆగ్రహం వ్యక్తంజేసింది. పశ్చిమాసియాలో వాణిజ్య నౌకలు, పౌర మౌలిక వసతులను లక్ష్యంగా చేసుకోవడాన్ని ఆపేయాలని... అంతర్జాతీయ జలమార్గాల్లో రవాణా స్వేచ్ఛగా జరగాలని పేర్కొంది. అంతే గాకుండా దిల్లీలో అమెరికా దౌత్యాధికారి జేసన్ మీక్స్‌ను పిలిపించి తీవ్ర నిరసన తెలిపింది. 24 మంది భారతీయులున్న మారివెక్స్ నౌకపై ఒమన్ తీరంలో అమెరికా నౌకాదళం మూడు రోజుల కిందట దాడి చేసిన సంగతి తెలిసిందే.ఇదిలా ఉండగా.. భారతీయ సిబ్బంది ఉన్న మరో నౌకపై తాజాగా దాడి జరిగింది. ఒమన్ తీరంలో ఆ నౌకపై అమెరికా మిలిటరీ దాడి చేసింది. వారం రోజుల వ్యవధిలో భారతీయ సిబ్బంది ఉన్న నౌకలపై అమెరికా దాడి చేయడం ఇది మూడోసారి కావడం గమనార్హం. తాజా ఘటనను ఒమన్‌లోని భారత ఎంబసీ వెల్లడించింది. ''గురువారం ఉదయం ఒమన్‌లోని షినాస్ పోర్టు సమీపంలో నౌకపై దాడి జరిగింది. పరిస్థితిని నిశితంగా గమనిస్తున్నాం. స్థానిక అధికారులతో సమన్వయం చేసుకుంటున్నాం'' అని పేర్కొంది. ఈ నౌక పేరు జలవీర్ అని తెలుస్తోంది.

దేశంలో మామిడికాయ తినాలంటే భయపడే పరిస్థితి

విశ్వంభర, జమ్మికుంట : దేశంలో మామిడికాయ తినాలంటే భయపడే పరిస్థితి నెలకొందని కేంద్రమంత్రి బండి సంజయ్ అన్నారు. కరీంనగర్ జిల్లా జమ్మికుంట కృషి విజ్ఞాన కేంద్రంలో కిసాన్‌మోర్చా ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయంపై ఏర్పాటు చేసిన రైతు సమ్మేళనంలో ఆయన మాట్లాడారు.'' హైదరాబాద్‌లో పాలు తాగి 3 రోజులు ఆసుపత్రి పాలయ్యా. 20 ఏళ్లలో ఎప్పుడూ నాకు జ్వరం రాలేదు. బీపీ, షుగర్ లేదు. నరేంద్ర మోడీయే నాకు స్ఫూర్తి. ప్రస్తుతం.. భూమి అంతా కెమికల్స్‌తో నిండిపోయింది. రోగానికి కారకులం మనమే.. నివారించగలిగేది మనమే. ప్రకృతి వ్యవసాయం దిశగా రైతులను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో రూ.2,400 కోట్లు కేటాయించింది. ప్రకృతి వ్యవసాయం చేస్తే రెండు.. మూడేళ్లు లాభాలు రాకపోయినా, ఆ తర్వాత రైతులు కోటీశ్వరులవుతారు. ఆర్గానిక్ ఉత్పత్తులను కొనేందుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. రైతులు గమనించి ప్రకృతి వ్యవసాయం చేయాలి.ముందుగా సేంద్రీయ సాగు చేసే వాళ్లు కోటీశ్వరులు కావొచ్చు. బడ్జెట్‌లో రూ.2 లక్షల కోట్లు యూరియాకు ఖర్చు చేస్తున్నాం. రూ.1.20 లక్షల కోట్ల సొమ్ము విదేశాలకు పంపి యూరియా దిగుమతి చేసుకోవడం బాధాకరం. రాబోయే రెండేళ్లలో కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో 25 వేల మంది రైతులను ప్రకృతి వ్యవసాయంవైపు మళ్లించేలా చర్యలు తీసుకుంటా. ప్రకృతి వ్యవసాయంతో వచ్చిన పంటకు మద్దతు ధర ఇచ్చేలా చూస్తాం. మన దేశ సొమ్మును విదేశాలకు పంపి ఆయిల్, బంగారం, ఎలక్ట్రానిక్ వస్తువులను కొంటున్నాం. అందుకే మేక్ ఇన్ ఇండియాతో స్వదేశీ ఉత్పత్తులను మోదీ ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది'' అని కేంద్రమంత్రి తెలిపారు.

అనిశ్చితిలోనూ బలమైన వృద్ధి

విశ్వంభర, నేషనల్ బ్యూరో: ప్రధాని మోడీ నేతృత్వంలో ఢిల్లీ వేదికగా జరిగిన నీతి ఆయోగ్ సమావేశానికి అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులు హాజరయ్యారు. ఇటీవలి కాలంలో పలురాష్ట్రాల సీఎంలు ఈ భేటీని బాయ్‌కాట్ చేస్తూ వచ్చిన నేపథ్యంలో.. ఈసారి మొత్తం 29 రాష్ట్రాల ముఖ్యమంత్రులు పాల్గొనడం గమనార్హం. రాష్ట్రపతి భవన్‌లోని కల్చరల్ సెంటర్‌లో ఈ 11వ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి బీజేపీ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులతోపాటు తమిళనాడు సీఎం విజయ్, కర్ణాటక సీఎం డీకే శివకుమార్, కేరళం నుంచి వీడీ సతీశన్, జమ్మూకశ్మీర్ నుంచి ఒమర్ అబ్దుల్లా తదితర విపక్ష నేతలు కూడా హాజరయ్యారు. వీరితో పాటు కేంద్రపాలిత ప్రాంతాల లెఫ్టినెంట్ గవర్నర్లు, పలువురు కేంద్రమంత్రులు కూడా భేటీలో పాల్గొన్నారు. సమావేశం ముగిసిన తర్వాత ఉత్తరప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ, జమ్మూకశ్మీర్ సీఎంలు వ్యక్తిగతంగా ప్రధాని మోడీని కలిశారు. ఏటా జరిగే ఈ భేటీకి గతేడాది నలుగురు సీఎంలు, 2024లో పది మంది, 2023లో తొమ్మిది మంది ముఖ్యమంత్రులు దుమ్మా కొట్టారు. ఈ నేపథ్యంలో ఈసారి కూడా చాలామంది సీఎంలు, ముఖ్యంగా బీజేపీయేతర పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాల సీఎంలు ఈ భేటీని బాయ్‌కాట్ చేస్తారని అంతా అనుకున్నారు. కానీ అందరు ముఖ్యమంత్రులు హాజరై తమ ఆలోచనలను పంచుకోవడం గమనార్హం. సమావేశానికి సంబంధించిన ఫొటోలను సోషల్ మీడియాలో పంచుకున్న ప్రధాని మోడీ.. 'ఫెడరలిజం స్ఫూర్తిలో నడుస్తూ భారత అభివృద్ధి ప్రయాణాన్ని వేగవంతం చేసేందుకు మేమంతా కలిసి పనిచేస్తున్నాం. వికసిత్ భారత్ లక్ష్యాన్ని చేరుకోవడానికి కేంద్రం, రాష్ట్రాల ఉమ్మడి కృషి చాలా కీలకం' అని పేర్కొన్నారు.

అనిశ్చితిలోనూ బలమైన వృద్ధి..

అంతర్జాతీయంగా అనిశ్చితి అలముకొని ఉన్నప్పటికీ భారత్ బలంగా ముందుకెళ్తోందని, నమ్మకంగా ఎదుగుతోందని ఈ భేటీలో ప్రధాని మోడీ అన్నారు. వికసిత్ భారత్ లక్ష్యాన్ని చేరుకోవడానికి అందరూ కలిసి బాధ్యత తీసుకోవడం చాలా ముఖ్యమని చెప్పారు. 'ప్రపంచంలో అనిశ్చితి, అస్థిరత కనిపిస్తోంది. ఇలాంటి సమయంలో కూడా భారత ఎదుగుదల బలంగా ఉంది' అని మోడీ చెప్పినట్లు నీతి ఆయోగ్ వెల్లడించింది. అలాగే చాలా దేశాలతో భారత్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు చేసుకుందని, తద్వారా దేశంలో ఎదుగుదలకు అవకాశాలు, ఎగుమతులను పెంచేందుకు వీలు కల్పించిందని మోడీ వెల్లడించారు. 'మన ఎంఎస్ఎంఈలకు ఈ ఒప్పందాలు మంచి అవకాశాలు సృష్టిస్తాయి. అంతర్జాతీయ ప్రమాణాలు పాటిస్తూ గ్లోబల్ మార్కెట్ల కోసం ప్రయత్నించడం వల్ల పోటీతత్వం కూడా పెరుగుతుంది' అని వివరించారు. నాణ్యమైన విద్య, డిమాండ్‌ను బట్టి నైపుణ్యాలు, ఉద్యోగావకాశాల సృష్టిపై ఫోకస్ పెట్టాలని, తద్వారా యువత ఎదుగుదలకు అవసరమైన పరిస్థితులను సృష్టించాలని ప్రధాని పేర్కొన్నారు. సాధికార యువతే దేశం వికసిత్ భారత్‌గా మారడానికి ఇంధనంలా మారతారన్నారు. రాష్ట్రాల మధ్య బంధాలు సహకారం, చర్చలతో నడవాలని సూచించారు. దీంతోపాటు కేంద్రంతో సహకారాన్ని పెంచడంలో కూడా నీతి ఆయోగ్ కీలక వేదికగా ఉంటుందని తెలియజేశారు. మహిళల నేతృత్వంలోని అభివృద్ధి 'వికసిత్ భారత్'కు మూలమన్న పీఎం.. వ్యవసాయం నుంచి స్టార్టప్‌లు, సైన్స్ అండ్ ఇన్నొవేషన్ సహా అన్ని రంగాల్లో మహిళలు ఎంతో కృషి చేస్తున్నారని కొనియాడారు. వారి పూర్తి సామర్థ్యాలను వెలికితీసేందుకు విద్య, నైపుణ్యాలు, భద్రత, మహిళా సాధికారతపై రాష్ట్రాలు దృష్టి పెట్టాలని సూచించారు.

ఎల్‌నినోపై ఆందోళన..

ఈ భేటీలో ప్రధాని మోడీ మాట్లాడుతూ వర్షాకాలంపై ఎల్‌నినో ప్రభావాన్ని ప్రస్తావించారు. ఈ విషయంలో ఉన్న ఆందోళనలను వివరించిన ఆయన.. రాష్ట్రాలు నీటిని జాగ్రత్తగా వాడుకోవాలని, సహజమైన ఆర్గానిక్ వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని సూచించారు. ఖరీఫ్ సీజన్‌లో 11 లక్షల టన్నుల సహజ ఎరువులను రైతులు కొనుగోలు చేశారని, ఇది పర్యావరణహిత వ్యవసాయంపై పెరుగుతున్న నమ్మకాన్ని సూచిస్తోందన్నారు.

డ్రగ్స్, గంజాయి రవాణాపై ఉక్కుపాదం మోపాలి

విశ్వంభర, హైదరాబాద్: తెలంగాణలో డ్రగ్స్, గంజాయి అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపాలని, మాదకద్రవ్యాల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. బండ్లగూడ జాగీర్‌లోని ఎక్సైజ్ అకాడమీలో గురువారం నిర్వహించిన అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్లు, ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ల దీక్షాంత్ పరేడ్ (ప్రాసింగ్ అవుట్ పరేడ్)లో ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి, కొత్తగా విధుల్లోకి అడుగుపెడుతున్న అధికారులు ప్రజాసేవ, కర్తవ్యనిష్ఠ, నిజాయితీని తమ సేవా జీవితానికి మార్గదర్శక సూత్రాలుగా మలచుకోవాలని పిలుపునిచ్చారు. శిక్షణలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన అధికారులకు మంత్రి పురస్కారాలు అందజేశారు.ఆరు నెలల కఠోర సంస్థాగత శిక్షణను విజయవంతంగా పూర్తి చేసుకున్న 28 మంది అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్లు, 89 మంది ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్లు కలిపి మొత్తం 117 మంది అధికారులు దీక్షాంత్ పరేడ్‌లో పాల్గొన్నారు. వీరిలో 33 మంది మహిళా అధికారులు ఉన్నారు. మంత్రి జూపల్లి మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర మద్యని షేధ, ఎక్సైజ్ శాఖ కేవలం ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చే శాఖ మాత్రమే కాదని, యువతను వ్యసనాల బారిన పడకుండా కాపాడటం, సమాజాన్ని మాదకద్రవ్యాల ముప్పు నుంచి రక్షించే అత్యంత కీలకమైన విభాగమని మంత్రి స్పష్టం చేశారు. ఒకప్పుడు నాటుసారా, గుడుంబా, దేశీదారు, కల్తీ కల్లు ప్రధాన సవాళ్లుగా ఉండేవని, ప్రస్తుతం గంజాయి, సింథటిక్ డ్రగ్స్, నార్కోటిక్ నెట్‌వర్క్‌లు, ఆన్‌లైన్ ద్వారా జరుగుతున్న అక్రమ వ్యాపారాలు కొత్త సవాళ్లుగా మారాయని తెలిపారు. డ్రగ్స్ అనేవి కేవలం చట్ట ఉల్లంఘన మాత్రమే కాదని, కుటుంబాలను విచ్ఛిన్నం చేసి యువత భవిష్యత్తును నాశనం చేసే సామాజిక విపత్తని పేర్కొన్నారు. అధికారులు స్వాధీనం చేసుకునే ప్రతి డ్రగ్స్ ప్యాకెట్ వెనుక ఒక యువకుడి భవిష్యత్తు ఉంటుందని, వారి విధులు కేసుల నమోదు వద్ద ముగియవని, సమాజాన్ని రక్షించడంలో ప్రారంభమవుతాయని అన్నారు. నేటి కాలంలో నేరగాళ్లు సాంకేతికతను వినియోగించి కొత్త మార్గాల్లో నేరాలకు పాల్పడుతున్నారని, వారిని ఎదుర్కోవడానికి అధికారులు కూడా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని మంత్రి సూచించారు. ప్రపంచంలోని అభివృద్ధి చెందిన దేశాలు డ్రగ్స్ నెట్‌వర్క్‌లను ఛేదించేందుకు డేటా అనలిటిక్స్, కృత్రిమ మేధస్సు (ఏఐ), ఆధునిక నిఘా వ్యవస్థలను వినియోగిస్తున్నాయని తెలిపారు.డ్రోన్ సర్వైలెన్స్ ద్వారా గంజాయి సాగు, అక్రమ సారా కేంద్రాలను గుర్తించడం, మొబైల్ యాప్స్, జీపీఎస్ ట్రాకింగ్ ద్వారా రవాణాను పర్యవేక్షించడం, సోషల్ మీడియా ఇంటెలిజెన్స్ ద్వారా డ్రగ్ నెట్‌వర్క్‌లను ముందుగానే పసిగట్టడం సాధ్యమవుతుందని చెప్పారు. తెలంగాణలో కూడా అంతర్జాతీయ స్థాయి నిఘా విధానాలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని మరింత విస్తృతంగా అమలు చేసే దిశగా చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు.

డ్రగ్స్‌పై నిర్దాక్షిణ్య పోరు అవసరం

డ్రగ్స్, గంజాయి రవాణాపై ఉక్కుపాదం మోపాలని, రాష్ట్రంలోకి మాదకద్రవ్యాలు ప్రవేశించకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని అధికారులకు సూచించారు. గంజాయి, మద్యం అక్రమ రవాణా చేసే ముఠాలపై కఠిన చర్యలు తీసుకోవాలని, అక్రమార్కులు ఎంతటివారైనా చట్టం ముందు మోకరిల్లేలా కర్తవ్య నిర్వహణ ఉండాలని స్పష్టం చేశారు.

సౌమ్య సాహసం స్ఫూర్తిగా తీసుకోవాలి..

క్రమశిక్షణ, నిజాయితీ, పారదర్శకత, ప్రజా సేవా దృక్పథమే అధికారుల అసలు గుర్తింపుగా ఉండాలని మంత్రి పేర్కొన్నారు. అక్రమ మద్యం తయారీ, మాదకద్రవ్యాల రవాణాను అరికట్టడం ద్వారా తెలంగాణను మరింత సురక్షితమైన, ఆరోగ్యకరమైన రాష్ట్రంగా తీర్చిదిద్దవచ్చని అన్నారు. నిజామాబాద్‌లో గంజాయి అక్రమ రవాణాను అడ్డుకునే క్రమంలో ప్రాణత్యాగం చేసిన కానిస్టేబుల్ సౌమ్య ధైర్యసాహసాలు కొత్త అధికారులకు స్ఫూర్తిగా నిలవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ ఖురేషీ, అకాడమీ డైరెక్టర్ సురేష్, జాయింట్ కమిషనర్ అంజన్‌రావు, జాయింట్ డైరెక్టర్ శశిధర్‌రెడ్డి, చీఫ్ డ్రిల్ ఇన్‌స్పెక్టర్ రంగారెడ్డి, ఇతర ఉన్నతాధికారులు, శిక్షణార్థుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

గృహిణులు మాత్రమే కాదు.. జాతి నిర్మాతలు

విశ్వంభర, నేషనల్ బ్యూరో : కుటుంబాన్ని నడిపే మహిళలు కేవలం గృహిణులు మాత్రమే కాదని.. ఈ దేశాన్ని నడిపించే జాతి నిర్మాతలని సుప్రీంకోర్టు అభివర్ణించింది. వారు కేవలం ఇంటి పనులు మాత్రమే చేయడం లేదని, భావి తరాలను తీర్చిదిద్దుతూ, దేశ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొంది. ఓ ప్రమాద కేసు విచారణ సందర్భంగా జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ ఎన్ కోటీశ్వర్ సింగ్‌తో కూడిన ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది.''గృహిణి అంటే ఇంటిపెద్దపై ఆధారపడే వ్యక్తిగా పరిగణించడం విడ్డూరంగా అనిపిస్తోంది. ఎందుకంటే వాస్తవానికి ఓ కుటుంబమంతా నిత్యం ఆమెపైనే ఆధారపడుతోంది. కానీ, ఆమె విలువకు తగిన గుర్తింపు లభించడం లేదు. వివిధ రంగాల్లో మహిళలు విజయం సాధిస్తున్నప్పటికీ.. ఇంటి పనుల విషయంలో ఆమెను ఇప్పటికీ తక్కువగానే అంచనా వేస్తున్నాం. కానీ, ఆమె లేకపోతే ఇంట్లో ఎన్నో పనులు ఆగిపోతాయి. ఆమె చేసే పని వెలకట్టలేనిది. కానీ, ఒకవేళ దాన్ని ఆర్థికంగా లెక్క కడితే.. నెలకు కనీసం రూ.30వేల కంటే ఎక్కువే అవుతుంది'' అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. జీతం లేకుండా మహిళలు చేసే ఇంటి పనులు.. దేశ జీడీపీలో 1517 శాతం వాటాకు సమానమనే అంచనాలున్నాయి. అయినప్పటికీ ఆమెకు మనం ఎలాంటి వేతనం చెల్లించడం లేదు సరికదా.. వారికి సరైన గుర్తింపు కూడా లభించడం లేదని సుప్రీంకోర్టు పేర్కొంది. ఈ సందర్భంగా వివాహ వ్యవస్థలో అనాదిగా వస్తోన్న ఆచారాన్ని ధర్మాసనం ప్రస్తావించింది. ''పెళ్లంటే పనుల కోసం ఓ మనిషిని నియమించుకోవడం కాదు. ఇంటి పనుల బాధ్యత ఆడవాళ్లదే అనే అభిప్రాయం చాలా మందిలో ఉంటోంది. కానీ, ఇందులో దంపతులిద్దరికి సమాన బాధ్యత ఉంటుంది. వివాహం జరిగిందన్న కారణంతో ఓ మహిళ తన కలలను, లక్ష్యాలను త్యాగం చేయాల్సిన అవసరం లేదు. పెళ్లి అంటే.. మహిళ గుర్తింపునకు ముగింపు కాదు'' అని ధర్మాసనం అభిప్రాయపడింది.

పంజాబ్‌కు చెందిన ఓ మహిళ 2001లో రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. దీంతో పరిహారం కోరుతూ ఆమె భర్త, ముగ్గురు పిల్లలు మోటార్ యాక్సిడెంట్ క్లెయిమ్స్ ట్రైబ్యునల్‌ను ఆశ్రయించారు. ఆమె కుటుంబానికి రూ.2.42లక్షల పరిహారం ఇవ్వాలని ట్రైబ్యునల్ ఆదేశించింది. దీనిపై అసంతృప్తి వ్యక్తం చేసిన బాధిత కుటుంబం పంజాబ్, హరియాణా ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. అనంతరం ఈ కేసు సుప్రీంకోర్టుకు చేరింది.

కోల్ గ్యాసిఫికేషన్‌కు హైదరాబాద్ మూలాధారం

విశ్వంభర, తెలంగాణ బ్యూరో : దేశీయ బొగ్గు వనరులను సమర్థవంతంగా వినియోగించుకునే 'కోల్ గ్యాసిఫికేషన్' విధానానికి హైదరాబాద్ నగరం ఎంతో కీలకంగా మారిందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి అన్నారు. నగరంలోని హెచ్ఐసీసీ నోవాటెల్ కన్వెన్షన్ సెంటర్‌లో కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ప్రారంభమైన 'ఉపరితల బొగ్గు/లిగ్నైట్ గ్యాసిఫికేషన్ ప్రోత్సాహక రోడ్‌షో'కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. ఒకప్పుడు దేశీయ బొగ్గులో బూడిద శాతం ఎక్కువగా ఉండటం వల్ల గ్యాసిఫికేషన్ సాధ్యం కాదనే అభిప్రాయం ఉండేదని గుర్తుచేశారు. కానీ, హైదరాబాద్‌లోని బీహెచ్ఈఎల్, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ వంటి పరిశోధన సంస్థల శాస్త్రవేత్తలు ఇక్కడి బొగ్గును గ్యాసిఫికేషన్ చేసే సాంకేతికతను విజయవంతంగా అభివృద్ధి చేశారని కొనియాడారు. తెలంగాణలో సింగరేణి వద్ద అపారమైన బొగ్గు నిల్వలు ఉన్నాయని, ఫార్మా రాజధాని అయిన హైదరాబాద్ నగరం.. కోల్ గ్యాసిఫికేషన్ ద్వారా ఉత్పత్తి అయ్యే మిథనాల్, అమ్మోనియా, హైడ్రోజన్ వంటి ఉత్పత్తులకు అద్భుతమైన మార్కెట్ అని ఆయన పేర్కొన్నారు. కోల్ గ్యాసిఫికేషన్‌ను మరింత వేగంగా ముందుకు తీసుకెళ్లేందుకు కేంద్ర ప్రభుత్వం రూ.46,000 కోట్ల భారీ ప్రోత్సాహక పథకాన్ని ప్రకటించిందని కిషన్ రెడ్డి వెల్లడించారు. ఇందులో భాగంగా ఇటీవల ఆమోదం పొందిన రూ.37,500 కోట్ల ప్రత్యేక పథకం ద్వారా దేశవ్యాప్తంగా మెగా గ్యాసిఫికేషన్ ప్రాజెక్టుల స్థాపన వేగవంతం కానుందని చెప్పారు. ఈ పథకం ద్వారా దేశంలోకి సుమారు రూ.3 లక్షల కోట్ల పెట్టుబడులు రావడమే కాకుండా, వేలాది మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. ప్రస్తుతం వివిధ రంగాల దిగుమతుల కోసం ఏటా వెచ్చిస్తున్న రూ.3 లక్షల కోట్ల విదేశీ మారకద్రవ్యాన్ని ఈ సాంకేతికత ద్వారా ఆదా చేయవచ్చని స్పష్టం చేశారు. చైనా, అమెరికా, దక్షిణాఫ్రికా దేశాల తరహాలోనే భారత్‌లోనూ ప్రపంచ స్థాయి గ్యాసిఫికేషన్ పరిశ్రమను అభివృద్ధి చేసేందుకు అవసరమైన నిల్వలు, పాలసీ మద్దతు, రాజకీయ నిబద్ధత దేశానికి ఉన్నాయని మంత్రి పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర బొగ్గు, గనుల శాఖ సహాయ మంత్రి సతీష్ చంద్ర దూబేతో పాటు పలువురు పరిశ్రమల ప్రతినిధులు, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

సెక్స్ వర్కర్ల కస్టమర్లపై 'ట్రాఫికింగ్' కేసులు కుదరవు

విశ్వంభర, తెలంగాణ బ్యూరో: సెక్స్ వర్కర్ల వద్దకు వెళ్లే కస్టమర్లపై పోలీసులు మానవ అక్రమ రవాణా కేసులు నమోదు చేసే విషయంలో తెలంగాణ హైకోర్టు కీలక స్పష్టతనిచ్చింది. సెక్స్ వర్కర్ సేవలను పొందిన వ్యక్తిని కేవలం ఖాతాదారుడనే కారణంతో ఐపీసీ సెక్షన్ 370 కింద నేరస్థుడిగా పరిగణించలేమని ధర్మాసనం తీర్పు వెలువరించింది. జస్టిస్ కె.లక్ష్మణ్, జస్ట